అట్టహాసంగా అభ్యర్థుల నామినేషన్లు

ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో పోటీ చేయనున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు గురువారం తమ నామినేషన్లను ఆర్‌ఓలకు సమర్పించారు. రెండు నియోజకవర్గాల పరిధిలో అభ్యర్థుల నామినేషన్ల ర్యాలీలు అట్టహాసంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులు తమ పార్టీల కార్యకర్తలు, నాయకులు, అభిమానులతో భారీ ఊరేగింపులను నిర్వహించారు. పార్టీల అభ్యర్థులతోపాటు అగ్రనేతలు హాజరయ్యారు. – ముషీరాబాద్, అంబర్‌పేట

బీజేపీ అభ్యర్థి పూస రాజు నామినేషన్

● ర్యాలీలో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్



ఆర్వోకు నామినేషన్ పత్రాలను అందజేస్తున్న పూస రాజు

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి పూస రాజు గురువారం నామినేషన్ దాఖలు చేశారు. మొదట అడిక్‌మెట్ అభయాంజనేయ స్వామి ఆలయంలో డాక్టర్ కె.లక్ష్మణ్‌తో కలిసి పూస రాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అప్పటికే అక్కడకు చేరుకున్న వేలాది మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు వెంట రాగా ర్యాలీ ప్రారంభ సూచికంగా శంఖం పూరించి లక్ష్మణ్‌ర్యాలీని ప్రారంభించారు. డప్పు కళాకారుల నృత్యాలు, యువకుల భారత మాతాకీ జై అనే నినాదాలు కాషాయ పగిడిలు ధరించిన కార్యకర్తలతో రాంనగర్, ముషీరాబాద్ వీధులు కాషాయ రంగు పులుకుమున్నట్లు తయారయ్యాయి. ర్యాలీ మధ్యలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేరి పూస రాజుకు మద్దతుగా ఓపెన్ టాప్ జీప్‌ల ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. రాంనగర్ చౌరస్తాలో భారీ క్రేన్‌తో గజమాలను లక్ష్మణ్, కిషన్ రెడ్డి, అభ్యర్థి పూజ రాజులకు వేశారు. రాంనగర్ చౌరస్తాలో డాక్టర్ కె.లక్ష్మణ్ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించి బీఆర్‌ఎస్ పార్టీ తూర్పారబట్టారు. నియోజకవర్గానికి చెందిన నలుగురు కార్యకర్తలు సుప్రీయనవీన్‌గౌడ్, పావనీ వినయ్‌కుమార్, రచనశ్రీ, కె.రవిచారిలు ఓపెన్ టాప్ జీప్‌లో పగిడీలు ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మరో ఓపెన్ టాప్ జీప్‌లో ముషీరాబాద్ ఎన్నికల ఇన్‌చార్జీ నాలుగు సార్లు ఎమ్మెల్యే అయిన ఎస్.ఆర్.విశ్వనాథ్ కదులుతూ ర్యాలీలో పాల్గొన్నారు. ఇక పూస రాజు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు మరో ఓపెన్‌టాప్ జీప్‌లో ప్రజలకు అభివాదం చేస్తు ముందుకు సాగారు. రాంనగర్ చౌరస్తా, ముషీరాబాద్ చేపల మార్కెట్, రాజా డీలక్స్, బోలక్‌పూర్, గాంధీనగర్ మీదుగా లోయర్ ట్యాంక్‌బండ్‌లోని ఆర్‌వో కార్యాలయానికి చేరుకొని నామినేషన్ దాఖలు చేశారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్ రమేష్‌రామ్, మద్దూరి శివాజీ, నవీన్‌గౌడ్, బద్రీనారాయణ, నరేష్, శేషసాయి, వినయ్‌కుమార్, పూస శ్రీకృష్ణ పాల్గొన్నారు.




ప్రజలకు అభివాదం చేస్తున్న కిషన్‌రెడ్డి, డాక్టర్ కె.లక్ష్మణ్, పూస రాజు

వైభవంగా ముఠా గోపాల్ నామినేషన్



ఆర్వోకు నామినేషన్ పత్రాలను అందజేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్

ముషీరాబాద్: ముషీరాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే ముఠా గోపాల్ గురువారం అంగరంగ వైభవంగా నామినేషన్ దాఖలు చేశారు. మొదట అడిక్‌మెట్ ఆంజనేయ స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం ప్రసిద్ధి గాంచిన ముషీరాబాద్ మహాకాళీ దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నామినేషన్ పత్రాలను అమ్మవారి పాదాల వద్ద పెట్టి వేదపండితులచే అర్చనలు చేయించారు. అనంతరం భారీ ర్యాలీని ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రారంభించారు. ఎంఐఎం కార్పొరేటర్ గౌస్‌ఉద్దీన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎడ్ల హరిబాబుయాదవ్, మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి, ముఠా జైసింహ తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీకి ముందు పోతరాజులు, బోనాలు, కోలాటం, లంబాడీల నృత్యాలు, జానపద డప్పుల దరువులు, పార్టీ నాయకుల నృత్యాలతో ర్యాలీ అంగరంగ వైభవంగా సాగింది. రాజడిలక్స్ చౌరాస్తా, గోల్కొండ చౌరస్తా, ఆర్టీసీ క్రాస్ రోడ్ మీదుగా ఇందిరాపార్కు లోయర్‌ట్యాంక్‌బండ్ వద్ద గల ఎంఆర్‌వో కార్యాలయం వరకు నిర్వహించారు. అనంతరం ఆర్వో లక్ష్మీనారాయణకు నామినేషన్ పత్రాలను సమర్పించారు. పార్టీ సీనియర్ నాయకులు శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, శ్రీధర్‌చారి, బింగి నవీన్, ఆరు డివిజన్ల అధ్యక్షులు వై.శ్రీనివాస్‌రావు, నర్సింగ్‌ప్రసాద్, ఆర్.మోజెస్, బల్ల శ్రీనివాస్‌రెడ్డి, రాకేష్‌కుమార్, వల్లాల శ్యామ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఓపెన్ టాప్ జీప్‌పై నుంచి మాట్లాడుతున్న ముఠా గోపాల్, ముఠా జైసింహ



అడిక్‌మెట్ ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ముఠా గోపాల్



బీఆర్‌ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్‌కు భారీ పూలమాల వేస్తున్న అభిమానులు

బీఆర్‌ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్ నామినేషన్



ఆర్‌వోకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న అంబర్‌పేట బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకటేష్

అంబర్‌పేట్: సిట్టింగ్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్ అట్టహాసంగా నామినేషన్ వేశారు. గురువారం బర్కత్‌పూర రాఘవేంద్ర స్వామి ఆలయంలో పూజాల అనంతరం భారీ ర్యాలీ తో బయలుదేరారు. బర్కత్‌పూరా, ఫీవర్ హస్పిటల్ చౌరస్తా, శివంరోడ్, రెడ్‌బిల్డింగ్ చౌరస్తా, అంబర్‌పేట ప్రధాన రోడ్ గాంధీ చౌరస్తా, శ్రీరమణ చౌరస్తా మీదుగా బీఆర్‌ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేష్ నామినేషన్ ర్యాలీ సాగింది. దారి పొడవునా కార్యకర్తలు, అభిమానులు పూలు చల్లుతూ హారతులు పట్టారు. గజమాలలు వేసి అభిమానాన్ని చాటుకున్నారు. వేలాది మందితో నామినేషన్ కార్యక్రమాన్ని బీఆర్‌ఎస్ అభ్యర్థి చేపట్టారు.

బీజేపీ అభ్యర్థి కృష్ణయాదవ్ నామినేషన్



అంబర్‌పేట ప్రధాన రోడ్‌లో నామినేషన్‌కు ర్యాలీగా వెళుతున్న బీజేపీ అభ్యర్థి కృష్ణయాదవ్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



ఆర్‌వోకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న బీజేపీ అభ్యర్థి కృష్ణయాదవ్

అంబర్‌పేట్: బీజేపీ అంబర్‌పేట నియోజకవర్గం అభ్యర్థి కృష్ణయాదవ్ నామినేషన్ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. నామినేషన్ ర్యాలీ కాషాయ మయం అయింది. కృష్ణయాదవ్ నామినేషన్ కార్యక్రమానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఆ పార్టీ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు గౌతమ్ రావు, కార్పొరేటర్లు కన్నె ఉమరమేశ్‌యాదవ్, అమృతలు ప్రత్యేకంగా హాజరయ్యారు. గురువారం నల్లకుంట ఓల్డ్ రామాలయంలో పూజాల అనంతరం తిలక్‌నగర్, శివంరోడ్, రెడ్‌బిల్డింగ్ చౌరస్తా, గాంధీ చౌరస్తా, శ్రీరమణ చౌరస్తాల మీదుగా అట్టహాసంగా ర్యాలీ కొనసాగింది. అంబర్‌పేట ఆర్‌వో కార్యాలయంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో ఆయన నామినేషన్ వేశారు. ర్యాలీలో కాషాయ దళం కదిలింది.

జోరందుకున్న నామినేషన్‌లు

ముషీరాబాద్: నామినేషన్‌ల గడువు ఒక్కరోజే మిగిలి ఉండడంతో గురువారం ఒక్క రోజే 11 నామినేషన్‌లు దాఖలయ్యాయి. బీఆర్‌ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్, బీజేపీ అభ్యర్థి పూస రాజులు అట్టహాసంగా నామినేషన్‌లు దాఖలు చేయగా సీపీఎం అభ్యర్థి ఎం.దశరథం, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి మల్లంపాటి రాజేందర్, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ నుంచి సయ్యద్ అలీ యహియా బిలాల్, యుగ తులసీ పార్టీ నుంచి పాశం సంతోష్‌రెడ్డి, బీఎస్‌పీ నుంచి పి.నరేందర్‌లతో పాటు మరో నలుగురు స్వతంత్ర్య అభ్యర్థులు నామినేషన్‌లను దాఖలు చేశారు. గురువారం ఒక్కరోజే 11 మంది నామినేషన్‌లు దాఖలు చేయగా ఇప్పటి వరకు మొత్తం 18 మంది నామినేషన్‌లను ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి దాఖలు చేశారు. శుక్రవారం మ.3 గంటల వరకు నామినేషన్‌కు గడువు ఉన్నట్లు ఆర్వో లక్ష్మీనారాయణ తెలిపారు.

బీజేపీ ఎన్నికల ప్రచార కమిటీ సభ్యుడిగా ఐజాక్ రాజ్



నల్లకుంట: బీజేపీ రాష్ట్ర ఎన్నికల ప్రచార కమిటీ సభ్యుడిగా నల్లకుంటకు చెందిన బీజేపీ మైనార్టీ మోర్చా మీడియా కన్వీనర్ ఎం.ఐజాక్ రాజ్ నియమితులయ్యారు. గురువారం బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు అఫ్సర్‌పాషా ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ ఎన్నికల ఇంచార్జి తరుణ్ చుగ్ రాష్ట్ర మైనార్టీ మోర్చా ప్రబారి ఆనంద్ మీనన్‌లను ఐజాక్ రాజ్ మర్యాద పూర్వకంగా కలిసి, తాను రూపొందించిన ఎన్నికల ప్రచార వ్యూహాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించినందుకు కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, అఫ్సర్ పాషాలకు కృతజ్ఞతలు తెలియజేశారు. బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళతానని చెప్పారు.

పూస రాజు, అంజన్‌కుమార్‌యాదవ్‌లపై కేసుల నమోదు

ముషీరాబాద్: నియమ, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినందుకు బీజేపీ అభ్యర్థి పూసరాజు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అంజన్‌కుమార్‌యాదవ్‌లపై కేసులను నమోదు చేసినట్లు ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ జహంగీర్‌యాదవ్ తెలిపారు. నామినేషన్ సందర్భంగా పూస రాజు డీజేలను ఉపయోగించారని, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారని అతనిపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే భోలక్‌పూర్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో అంజన్ కుమార్‌యాదవ్ కూడా డీజేలను ఉపయోగించడంతో పాటు సాధారణ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించినందుకు ఆయనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బాలోత్సవం ఆడియో ఆవిష్కరణ



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రముఖ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ రచించిన తెలంగాణ బాలోత్సవం ఆడియోను గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆవిష్కరించారు. అనంతరం సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ... చిన్నారుల్లో సృజనాత్మకతను వెలికి తీయడానికి తెలంగాణ బాలోత్సవ కమిటి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. భావితరాల అభ్యున్నతికి మరింతగా పాటుపడాలని కోరారు. తెలంగాణ బాలోత్సవం ప్రధాన కార్యదర్శి సోమయ్య, ప్రముఖ సామాజికవేత్త రమేష్, బాలోత్సవ కమిటీ ఉపాధ్యక్షురాలు సుజాత, బుచ్చిరెడ్డి, మమత, కృష్ణ, వై.వి.రావు తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థుల ఆస్తుల వివరాలు

అప్పులు లేని బీఆర్‌ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్

కవాడిగూడ: ముషీరాబాద్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన అభ్యర్థులు ప్రకటించిన అప్పులు, ఆస్తులకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో భాగంగా గురువారం ముషీరాబాద్ నియోజకవర్గంలో ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు భరీ సంఖ్యలో అఫిడవిట్‌లు సమర్పించారు. వివరాలివీ...

◆ ముషీరాబాద్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్



చరాస్తులు: రూ. 97,74,366
స్థిరాస్తులు: రూ. 2,03,14,512
కేసులు: ఎలాంటి కేసులు లేవు
ముఠా సరోజ (ముఠాగోపాల్ సతీమణి)
చరాస్తులు: రూ. 35,77,173
స్థిరాస్తులు: రూ. 3,40,00,000
అప్పులు: రూ. 47,25,956

◆ అప్పులు, వ్యవసాయ భూమిలేని కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్ యాదవ్

ముషీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అంజన్‌కుమార్‌యాదవ్ తనకు ఎలాంటి అప్పులు, వ్యవసాయ భూమి లేవని తన అఫిడవిట్‌లో ప్రకటించారు.



అభ్యర్థి పేరు: ఎం. అంజన్‌కుమార్ యాదవ్
పార్టీ: కాంగ్రెస్ పార్టీ
చరాస్తులు: రూ. 34,80,000
స్థిరాస్తులు: రూ. 92,50,000
టయోటా ఫార్చునర్ వాహనం, 70 గ్రాముల బంగారం
కేసులు: చిన్న చిన్న కేసులు తప్ప నేరాలకు సంబంధించిన ఎలాంటి కేసులు లేవు
ఎం. నాగమణి (అంజన్‌కుమార్ యాదవ్ సతీమణి)
చరాస్తులు: రూ. 15,20,000
స్థిరాస్తులు: రూ. 3,32,50,000
అప్పులు: లేవు

◆ బీజేపీ అభ్యర్థి పూసరాజు



చరాస్తులు: రూ. 42,91,869
స్థిరాస్తులు: రూ. 18,20,000 (ఉమ్మడి ఆస్తులను కలుపుకొని)
అప్పులు: రూ. 94,47,200
కేసులు: ఎలాంటి కేసులు లేవు
పూస లావణ్య (పూసరాజు సతీమణి)
చరాస్తులు: రూ. 29,99,394
స్థిరాస్తులు: రూ. 12,90,000
ఉమ్మడి ఆస్తులు: రూ. 64,00,000
అప్పులు: రూ. 18,42,600

ఇథనాల్ వ్యతిరేక ఉద్యమంపై ఉక్కుపాదం దారుణం

● పోరాట కమిటీ నాయకులపై కేసులను ఎత్తివేయాలి
● తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఇథనాల్ వ్యతిరేక ఉద్యమంపై ఉక్కుపాదాన్ని మోపడం సరైంది కాదని ఇది రాజ్యాంగం కల్పించిన హక్కులను ఉల్లంఘించడమేనని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ... నారాయణపేట జిల్లా మరికల్ మండలం చిత్తనూర్ గ్రామం దగ్గర జూరాల ఆర్గానిక్ ఫార్మ్ అండ్ ఆగ్రో ఇండస్ట్రీస్ వారు ఇథనాల్ కంపెనీ ఏర్పాటు చేశారన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ జరగకుండా ఈ కంపెనీ ఏర్పాటు చేయడం సరైంది కాదని ఈ కంపెనీ ఉత్పత్తి జరిగితే దాని ప్రభావం చుట్టు పక్కల ఉన్న 54 గ్రామాలపై పడుతుందన్నారు. గాలి, నీరు, భూగర్భ జల కాలుష్యం పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణానది కాలుష్యపు కోరల్లోకి వెళ్తుందని పర్యావరణ వేత్తలు కూడా చెబుతున్నారని అయినా ప్రభుత్వం ఇవేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తు ఇథనాల్ కంపెనీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న వారిని చిత్రహింసలకు గురి చేసి జైలులో నిర్బంధించడం దుర్మార్గమైన చర్య అన్నారు. పోరాట కమిటీ నాయకులు, రైతులపై పెట్టిన కేసులను బేషరత్తుగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ... కంపెనీ పరిసర ప్రాంతాల్లోని పంట పోలాల్లో పని చేసే కూలీలు ఊపిరాడక స్పృహతప్పి పడిపోతున్నారని అన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రజలపై పెట్టిన కేసులను బేషరుత్తుగా ఎత్తివేసి ఆ కంపెనీని మూసి వేయాలని డిమాండ్ చేశారు. పాలమూరు అధ్యాయన వేదిక కన్వీనర్ రాఘవాచారి, సైంటిస్టు బాబురావు, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య, వివిధ సంఘాల నాయకులు కన్నెగంటి రవి, సారంపల్లి మల్లారెడ్డి, సాదినేని వెంకటేశ్వర్‌రావు, జ్యోతి, సంజీవ్, చంద్రశేఖర్, పి.ఎల్.విశ్వేశ్వర్‌రావు, చక్రవర్తి ప్రసంగించారు.

అవిశ్రాంత పోరాట యోధుడు చంద్ర పుల్లారెడ్డి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఆరుట్ల జానకిరెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: గోదావరి లోయ రైతాంగ ప్రతిఘటన పోరాట నిర్మాణ యోధుడు చంద్ర పుల్లారెడ్డి 39వ వర్ధంతిని సీపీఐ(ఎంఎల్) రామచంద్రన్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్ర పుల్లారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రొఫెసర్ ఆరుట్ల జానికిరెడ్డి మాట్లాడుతూ... బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం చంద్రపుల్లారెడ్డి చేసిన పోరాటం చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. విప్లవోద్యమ నిర్మాణం కోసం అవిశ్రాంతంగా కృషి చేసిన గొప్ప వ్యక్తి అన్నారు. అమరవీరుల ఆశయాలను కొనసాగించినప్పుడే చంద్ర పుల్లారెడ్డికి ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. రైతు కూలీ సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఎల్లుట్ల ఉపేందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏపీసీఎల్‌సీ అధ్యక్షుడు ముప్పాల సుబ్బారావు, సీపీఐఎంఎల్ రామచంద్రన్, రాష్ట్ర నాయకులు ఎల్లుట్ల మల్లేష్, పీవైఎల్ కన్వీనర్ భానుప్రసాద్, దుర్గం సైదులు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థుల నామినేషన్ల ర్యాలీలతో ట్రాఫిక్ కష్టాలు

ఫీవర్ చౌరస్తా సమీపంలో ట్రాఫిక్‌లో ఇరుక్కున్న అంబులెన్స్



నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా వద్ద ట్రాఫిక్‌లో చిక్కుకు పోయిన అంబులెన్స్

నల్లకుంట: నామినేషన్లు వేసేందుకు అన్ని పార్టీల అభ్యర్థులు పోటాపోటీగా భారీ ర్యాలీలు తీస్తూ వెళుతున్నారు. దీంతో పలు చోట్ల ట్రాఫిక్ స్తంభించి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఆస్పత్రులకు తీసుకు వెళ్లే అంబులెన్స్‌లు ట్రాఫిక్ ఇరుక్కుపోతున్న పరిస్థితులు. గురువారం ఉదయం నామినేషన వేసేందుకై బీఆర్‌ఎస్ అభ్యర్థి బర్కత్‌పుర నుంచి భారీ ర్యాలీగా బయలు దేరారు. వేలాది నాయకులు, కార్యకర్తలు పాల్గొన్న ర్యాలీ నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా వద్దకు చేరుకునే సరికి ఓ వైపు పూర్తిగా ట్రాఫిక్ స్థంభించిపోయింది. అదే సమయంలో శంకరమఠం నుంచి బర్కత్‌పుర వైపు అత్యవసర పరిస్థితిలో ఓ రోగిని ఆస్పత్రికి తీసుకు వెళుతున్న ఓ అంబులెన్స్ ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా సమీపంలో ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయింది. అంబులెన్స్ డ్రైవర్ చాలా సేపు సైరన్ మోగిస్తూనే ఉన్నాడు. ఓ వైపు బ్యాండ్ సప్పుల్లతో మారుమోగిన ఆ ప్రాంతంలో అంబులెన్స్ సైరన్ పోలీసులకు వినిపించలేదు. కొద్ది సేపటి తర్వాత అంబులెన్స్ సైరన్ విని అక్కడే విధుల్లో ఉన్న నల్లకుంట పోలీసులు కొద్ది సేపు ఓ వైపు ర్యాలీని నిలిపి అతి కష్టం మీద కొంత సమయం ట్రాఫిక్ క్లియర్ చేశారు. దీంతో ట్రాఫిక్‌లో చిక్కుకున్న అంబులెన్స్ అక్కడి నుంచి బయట పడింది.

నేడు బీఆర్‌ఎస్‌లో చేరనున్న సంగిశెట్టి జగదీష్



ముషీరాబాద్: కాంగ్రెస్ పార్టీకీ రాజీనామా చేసిన పీసీసీ ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జగదీష్ శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరనున్నారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎన్నికల ఇన్‌చార్జీలు ఎమ్మెల్సీ ఎం.ఎస్.ప్రభాకర్, కన్నాయాదవ్‌ల నేతృత్వంలో సంగిశెట్టి జగదీష్ అనుచరులు బీఆర్‌ఎస్‌లో చేరనున్నారు.

చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్‌గా సీతయ్య



చిక్కడపల్లి: చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా ఎ.సీతయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. 2004వ బ్యాచ్‌కు చెందిన మొదటగా చాదర్‌ఘట్ ఎస్‌ఐగా, ఫలక్‌నామా, 2013లో సీఐగా పదోన్నతిపొంది ఛత్రినాక, తర్వత మహబూబ్‌నగర్, ఆత్మకూర్, మక్తల్‌లలో 10 సంవత్సరాలు పనిచేశాన్నారు. డీఐగా ప్రమోషన్‌పై చాదర్‌ఘట్ నెలరోజులు ఉన్నానని సీతయ్య వివరించారు. ఈ సందర్భంగా ఏసీపీ ఎ.యాదగిరి, అడ్మిన్ ఎస్.ఐ.నాగరాజు, ఎస్ఐ అభిలాష్, ఎస్ఐ కోటేశ్వర్‌రావు, ఎస్ఐ మౌనిక, డీఎస్ఐ శశిపాల్‌రెడిలు సిబ్బంది ఇన్‌స్పెక్టర్‌ను అభినందించారు.

యువతి ఆత్మహత్య

కాచిగూడ: తల్లిదండ్రులు మందలించడంతో తీవ్ర మనస్థాపానికి గురైన ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. కాచిగూడ ఎస్ఐ పి.రవి కుమార్ సమాచారం మేరకు... గోల్నాక కూరగాయల మార్కెట్ ప్రాంతానికి చెందిన యాదయ్య కూతురు బి.సౌమ్య(21) డిగ్రీ చదువుతోంది. తల్లిదండ్రులు మందలించడంతో సౌమ్య మనస్థాపానికి గురై గురువారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సోదరుడు గౌతమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

బీఆర్‌ఎస్ పాలనలో గిరిజన సంక్షేమానికి ప్రాధాన్యం

లాలాపేట: రాష్ట్రంలోని గిరిజనుల సంక్షేమానికి పెద్ద పీట వేసిన బీఆర్‌ఎస్‌కు ఈ ఎన్నికల్లో గిరిజన సంక్షేమ సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు సమాచార శాఖ రాష్ట్ర మాజీ కమిషనర్ డా. గుగులోతు శంకర్ నాయక్ తెలిపారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట జీఎస్‌ఎస్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు బంధు, రైతు బీమా, 24 గంటల విద్యుత్, కల్యాణ లక్ష్మీ, తాగు నీరు, సాగు నీరు వంటి పథకాలతో రూపొందిన వాల్‌పోస్టర్‌ను ప్రదర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మా తండాలో మా రాజ్యం పేరుతో 3146 గిరిజన తండాలను గ్రామ పంచాయితీలుగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. సంత్ సేవాలాల్, కొమురం భీమ్‌ల జయంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడంతో పాటు బంజారా భవన్ నిర్మాణం చేపట్టారని కొనియాడారు. అన్ని రంగాల్లో తెలంగాణను అభివృద్ధిలో అగ్రభాగాన నిలిపిన బీఆర్‌ఎస్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలనీ కోరారు. ముచ్చటగా మూడవ సారి కేసీఆర్ సీఎం కావడం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు.


ముషీరాబాద్‌లో బీజేపీకి భారీ మెజారిటీ ఖాయం



బైక్ ర్యాలీని ప్రారభిస్తున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి: శాసనసభ ఎన్నికల్లో ముషీరాబాద్ నియోజవర్గం బీజేపీ అభ్యర్థి పూసరాజు నామినేషన్ దాఖలు చేయడానికి నిర్వహించిన భారీ బైక్ ర్యాలీకి గాంధీనగర్ డివిజన్ నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్లారు.ఈ బైక్ ర్యాలీకి గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ బీజేపీ గురువారం పార్టీ జెండా ఊపీ ప్రారంభించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ... ఎన్నికల్లో భారీ మెజారిటీతో బీజేపీ విజయం సాధించడం ఖాయమన్నారు. గాంధీనగర్ డివిజన్ సీనియర్ నాయకులు, ఓబీసీ మోర్చా, బీజేవైఎం, మహిళా మోర్చా, మైనార్టీ మోర్చా నాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'భువన విజయం'



చిక్కడప్లలి: మోహన్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి చిక్కడపల్లిలోని త్యాగరాయగానసభలో నిర్వహించిన భువన విజయం నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రొఫెసర్ శ్రీదేవి శ్రీకృష్ణదేవరాయలుగా పాత్ర పోషణ చేసి అలరించింది. మహాలక్ష్మీ, గాంధీ, అక్కిరాజు సుందరరామకృష్ణ తదితరులు కవుల పాత్రలను పోషించి భువన విజయం ప్రదర్శనను రక్తికట్టించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు, ప్రముఖులు మహ్మద్ రఫీ, పి.రామ్మోహన్, శ్రీకాంత్, మూసా అలీఖాన్, గాంధీ శశిబాల తదితరులు పాల్గొని ప్రొఫెసర్ శ్రీదేవి తదితరులను అభినందించారు.